www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 24 డిసెంబర్ 2023

వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌గా 'మిట్స్' విద్యార్థి

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (మిట్స్)లో బి.టెక్ మెకానికల్ ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న ఎం.సాయినాథ్ నాయక్ 10వ ప్రపంచ వెయిట్ లిఫ్టింగ్ ఇంక్లైన్ బెంచ్ ప్రెస్ ఛాంపియన్‌షిప్ 2023లో ప్రతిభ కనపరిచి రెండు వెండి పతకాలు సాదించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. హైదరాబాద్‌లోని లాల్‌హదూర్‌శాస్త్రి స్టేడియంలో జరిగే పోటీలలో ఈ విద్యార్థి పాల్గొని ప్రతిభ కనపరిచి రెండవ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థి సాయినాథ్‌ను కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ దామోదరన్, అధ్యాపకులు మరియు విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

సాయినాథ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ యువరాజ్

సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీల

రిలే నిరాహార దీక్షలు

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ అన్నమయ్య జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం నాటికి 12వ రోజుకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐసిడిఎస్, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట అంగన్వాడీలు పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగిస్తున్నారు. రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఒంటి కాలిపై నిల్చుని, దండాలు పెడుతూ వినూత్నంగా నిరసన తెలియజేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్వాడీలు మాత్రం సమస్యలు పరిష్కారమయ్యే వరకూ సమ్మె విరమించేది లేదంటూ నినాదాలు చేశారు. అంగన్వాడీల సమ్మెకు పార్టీలు, ప్రజలు, ప్రజా సంఘాల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోంది.

రాజంపేట : ఒంటి కాలిపై నిల్చుని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

- ఒంటి కాలిపై నిల్చుని వినూత్న నిరసన
- 12వ రోజూ కొనసాగిన సమ్మె

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అంగన్వాడీల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిరంకుశ వైఖరిని విడనాడాలని అంగన్వాడీలు డిమాండ్ చేశారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించి సమ్మెను విరమింపచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ముందు అంగన్వాడీలు రిలేనిరాహార దీక్షలు చేపట్టారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు అంజలి, ముకుల, లక్ష్మీదేవి, మస్రూన్ బి, విజయ ఉదయం నుండి సాయంత్రం వరకు మంచినీరు ముట్టుకోకుండా నిరాహార దీక్షలో కూర్చున్నారు. వారికి మద్దతుగా ప్రాజెక్టులోని వర్కర్లు శిబిరంలో కూర్చుని తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రభుత్వం అంగన్వాడీల సెంటర్ల తాళాలు పగలకొట్టమని సచివాలయ ఉద్యోగుల చేత చేయిస్తూ మరో వైపు సమస్యల పరిష్కారానికి సానుకూలం అంటూ చెప్పడం సరైంది కాదన్నారు. అంగన్వాడీలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి ఉషశ్రీ చరణ్, ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్‌రెడ్డి తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి బొత్స సత్యనారాయణ అంగన్వాడీలు విధులకు హాజరు కావాలని, మూడు నెలల్లో సమస్యలను పరిష్కారం చేస్తామంటూనే వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు ఐసిడిఎస్ విధుల నిర్వహణ నిమిత్తం డబ్బులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. నిత్యం కష్టపడే అంగన్వాడీలకు డబ్బులుండవా అని ప్రశ్నించారు. లబ్దిదారులకు ప్రభుత్వం మీద వ్యతిరేకత తగ్గించడానికి హడావుడిగా సిబ్బందిని సమకూర్చే పని చేస్తోందని తద్వారా ప్రీస్కూల్ నిర్వాహణ దెబ్బతింటోందన్నారు. సాయంత్రం 5 గంటలకు దీక్షలో కూర్చున్న వారికి సిఐటియు, అంగన్వాడీ యూనియన్ నాయకులు టెంకాయ నీళ్లిచి దీక్షను విరమింపజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీలు సిద్దమ్మ, విజయ, సుమలత, ఉమాదేవి, రమణమ్మ, పద్మజ, కవిత, ప్రవీణ, లక్ష్మీదేవి, అరుణ పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడి కార్యకర్తలు ఆయాలు ఒంటి కాలిపై నిలబడి గోవింద నామాలు చెబుతూ వినూత్నంగా నిరసన తెలిపారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా సిఎం జగన్‌కు జ్ఞానోదయం కలిగి అంగన్వాడీల డిమాండ్లు నెరవేర్చే విధంగా ఆయన మనసు మార్చాలని కోరుతూ గోవింద నామాలు ఉచ్చరించారు.

మదనపల్లె : దండాలు పెడుతూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

సంఘీభావం తెలిపిన 'చమర్తి'

ఐసిడిఎస్ కార్యాలయంలో అంగన్వాడీలు చేస్తున్న నిరసనలో రాజంపేట టిడిపి పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు పాల్గొని సంఘీభావం తెలిపారు. అంగన్వాడీలతో కలిసి వారికి న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మహిళా పక్షపాతిని అంటూ చెప్పుకుంటూ అంగన్వాడీ మహిళలను వేధింపులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. ఎన్నికల ముందు వారికి లేనిపోని హామీలు గుప్పించి నేడు విస్మరించడం సరికాదన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్, టిడిపి రూరల్ అధ్యక్షులు గన్నేసుబ్బ నరసయ్య నాయుడు, మాజీ మండలాధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, హ్యూమన్ రైట్స్ కమిషన్ వైస్ చైర్మన్ దాసరి రాజు వాణి, అంగన్వాడి కార్యకర్తలు రమాదేవి, సుజాత, ఈశ్వరమ్మ, శివరంజని, విజయ, అమరావతి పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ముందు అంగన్వాడీ కార్యకర్తలు వారి డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని చేస్తున్న సమ్మెకు రైల్వేకోడూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాథ నాయుడు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ మహిళా శిశు సంక్షేమ శాఖకు ఎక్కువ బడ్జెట్ ఉన్నప్పటికీ జగన్ అంగన్వాడీలను మోసం చేసి కేవలం రూ.వెయ్యి మాత్రమే పెంచి చేతులు దులుపుకోవడం సబబా అని ప్రశ్నించారు. అంగన్వాడీ కార్యకర్తలు న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించమని ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం చేస్తుంటే ఈ చేతగాని ముఖ్యమంత్రి జగన్ వారిపై కక్షగట్టి ఉక్కు పాదం మోపడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వర నాయుడు, రైల్వేకోడూరు మండల పార్టీ అధ్యక్షులు కొమ్మ శివ, రాజంపేట పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షులు పులేల రమేష్, రాజంపేట ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు తేనెపల్లి చిన్న, శివ, తదితర నాయకులు పాల్గొన్నారు. **మదనపల్లి :** స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద నిలబడి దండాలు పెడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మధురవాణి, రాజేశ్వరి మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గౌరి, కరుణ, స్వారూపా, భూకైలేశ్వరి, అమ్మాజీ, విజయ, అఖిరున్నిసా, బాగ్యా, గీతా సుజాని, శ్రీవాణి, ఈశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** అంగన్వాడీల సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామని ప్రాజెక్టు అధ్యక్షులు సుకుమారి పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ కార్యదర్శి ఓబులమ్మ, నాయకులు ప్రభావతి, శ్రీవాణ, నాగమణి, నాగవేణి, లక్ష్మీదేవి, అంగన్వాడి వర్కర్లు పాల్గొన్నారు బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మొలకలచెరువు మండలం అంగన్వాడీలు తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. **పీలేరు:** అంగన్వాడీలు నిరసనను కొనసాగించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని అంగన్వాడీలు, నాయకులు వెంకట్రామయ్య, టిఎల్ వెంకటేష్, నరసింహులు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు : అంగన్వాడీలకు మద్దతు తెలిపిన టిడిపి నాయకులు

రాయచోటి : రిలేదీక్షల్లో నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు

నిరసనల వేడి

ప్రజాదృష్టి

జిల్లాలో అంగన్వాడీ, ఆశా, సమగ్రశిక్ష అభియాన్, జిల్లా రైతు సంఘాల నాయకుల నిరసనల పరంపర కొనసాగుతోంది. ప్రభుత్వం సత్వరమే స్పందించి ఆయా సంఘాల న్యాయబద్ధమైన డిమాండ్ల పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు. 2017 నవంబర్‌లో చేపట్టిన పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చడం న్యాయ సమ్మతం. అదీగాక నాలుగవ తరగతి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడం ప్రాథమిక కర్తవ్య మనే సంగతిని గుర్తించాలి. రాష్ట్రంలో ఎవరు పాలకులుగా ఉన్నప్పటికీ అట్టడుగు స్థాయి ఉద్యోగులు మొదలుకుని పేదలకు సాధ్యమైన మేరకు న్యాయం చేయడం తప్పనిసరి. అటువంటి కిందిస్థాయి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోవడం విడ్డూరమనే చెప్పాలి. అంగన్వాడీలు, ఆశాలకుతోడు సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగులు నిరసనల బాట పట్టడంలోని న్యాయమైన ఆకాంక్షలను తక్షణమే పరిగణలోకి తీసుకోవాలి. ఐదేళ్ల కిందట అధికారంలోకి వచ్చిన వైసిపి సర్కారుకు రెండేళ్ల కరోనా నేపథ్యంలో డిమాండ్లను నెరవేర్చాలని రోడ్డెక్క లేదు. 2024 సార్వత్రిక ఎన్నికల ముంగిటనైనా తమ న్యాయ బద్ధమైన డిమాండ్లను పరిశీలించాలని అంగన్వాడీలు, ఆశాలు భిక్షాటన ద్వారా నిరసన తెలపడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఇంతటి స్థాయిలో తీవ్ర నిరసన తెలుపుతున్న సంఘాలతో సంప్రదింపులు చేసి వారి న్యాయబద్ధమైన ఆకాంక్షలు నెరవేర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గత టిడిపి ప్రభుత్వం నాలుగవ తరగతి ఉద్యోగులను విస్మరించిన ఫలితమే అధికార భోగమనే సంగతిని గుర్తెరిగి నడుచుకోవాలి. లేనిపక్షంలో సార్వత్రిక ఎన్నికల ముగింట తెంపరితనానికి తగిన ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉందని గమనించాలి. కరువు మండలాలను ప్రకటించాలని కోరుతూ రైతు సంఘాల నాయకులు రోడ్డుపైకి రావడం గమనార్హం. ఒకరికి ఒకరు తోడుగా ప్రజా సంఘాలన్నీ రోడ్డుబాట పడుతున్న నేపథ్యంలో ప్రాప్తకాలజ్ఞతను ప్రద ర్శించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తెలంగాణ ఎన్నికల ఫలితాలే ఇందుకు రుజువుగా నిలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో వచ్చిన ప్రజామద్దతు కారణంగానే అధికారం చేతులు మారిన వైనాన్ని విస్మరించరాదు. రాష్ట్రంలోనూ ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు చిటపటల నేపథ్యంలోనూ ఇటువంటి తరహా వాతావరణమే కనిపిస్తోంది. గ్రామీణ ప్రజానీకానికి సంక్షేమ ఫలాలను అందించే సంక్షేమ కార్యకర్తలను విస్మరిస్తే ఎటువంటి ఫలితం లభించనుందో మేల్కోవాల్సిన అవసరం ఉంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

టిడిపి నాయకులను కలిసిన 'సుగవాసి'

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లి తెలుగుదేశం పార్టీ నాయకులను రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం శనివారం కలిశారు. ఈ సందర్భంగా రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్జే వెంకటేష్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాటకొండ మధుబాబులను కలిసి పార్టీ స్థితిగతులపై చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మీ గెలుపుకు సాయ శక్తుల కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చిన బాబు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంగారపు నవీన్, రాజంపేట పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి పూల మురళి, గండికోట గణేష్, మాజీ సర్పంచ్ లక్ష్మన్న, మాజీ మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు జి.కె.వెంకటరమణ, మాజీ మండల పరిషత్ అధ్యక్షులు ఆంజనేయులు, రాజంపేట పార్లమెంటు మహిళా ప్రధాన కార్యదర్శి విజయమ్మ, ప్రతాప్, పెద్ద ఎత్తున పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పెంపకం లాభదాయకం

ప్రజాశక్తి - సంబేపల్లి (రాయచోటి)

పెరటి కోళ్ల పెంపకం లాభదాయకమని ఐసిఐసిఐ ఫౌండేషన్ జిల్లా డెవలెప్ మెంట్ అధికారిణి రాజేశ్వరి అన్నారు. ఐసిఐసిఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంబేపల్లె మండలంలో మొటుకువాండ్లపల్లె హరిజన వాడ, నడిమిరాజు వారిపల్లె హరిజన వాడ, ఆవులవాండ్లపల్లె, ఊరగాయగుట్ట పల్లె, చిన్నకోడివాండ్ల పల్లె, కొత్తపల్లె బిడికి, రెడ్డిమల్లువారిపల్లెలోని ఎస్‌సి, ఎస్‌టిలు, భూములు లేని పేదలకు, వికలాంగులు, ఒంటరి మహిళలకు నాటు కోళ్లను పంపిణీ చేశారు. ఒకొక్క కుటుంబానికి 11 కోళ్లను (ఒక కోడి బరువు సుమారు ఒక కిలో) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయం, పాడి తర్వాత స్థానం పెరటి కోళ్ల పెంపకానిదని, నాటు కోళ్ల పెంపకం ద్వారా మంచి ఆర్థిక పరిపుష్టి సాధించవచ్చునన్నారు. ఉత్పత్తి సామర్థ్యం ఎక్కువగా ఉండే కోళ్లను ఇంటి పరిసరాల్లో పెంచుకోవచ్చునని, పేదలకు ఐసిఐసిఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా పెరటి కోళ్లను అందించడం జరుగుతోందన్నారు. ఇంటి పరిసరాల్లో పెంచుకోవచ్చునని తద్వారా మంచి ఆదాయం పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఫెసిలిటేటర్లు సుప్రియ, అనూష, ధరణేశ్వరి పాల్గొన్నారు.

కడపకు కొత్తరూపు!

ప్రజలకు అభివాదం చేస్తున్న సిఎం జగన్

వైద్యులతో సెల్ఫీ దిగుతున్న సిఎం జగన్

- బద్వేల్‌లో రూ.1,000 కోట్లతో సెంచురీ పరిశ్రమ
- సూపర్‌స్పెషాలిటీ, కేన్సర్‌కేర్, సైక్రియాటిక్ ఆస్పత్రుల ప్రారంభోత్సవాలు
- బద్వేల్, కడప ప్రాంతాల పర్యటనలో సిఎం జగన్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/బద్వేలు/కడప అర్బన్/కడప

కడపలో ఆహ్లాదకరమైన రాజీవ్‌పార్క్ మొదలుకుని కీలక సర్కిళ్ల ఆధునీకరణ, సూప ర్‌స్పెషాలిటీ ఆస్పత్రి, బద్వేల్‌లో సెంచురీ ఏర్పాటు పనులతో కడప నగరానికి కొత్తరూపు తీసుకొచ్చామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన కడప, బద్వేల్ పట్టణాల్లోని పలు అభివృద్ధి పనుల ప్రారం భోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడపకు రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చామన్నారు. కడప నగరంలో రూ.56 కోట్లతో అంబే ద్కర్ సర్కిల్, రూ.1.50 కోట్ల కుడా నిధుల సహా యంతో కోటిరెడ్డి సర్కిళ్లను ఆధునీకరిం చామన్నారు. పచ్చదనంతో కూడిన రాజీవ్‌పార్క్, ఆరో గ్యానికి కొత్త హంగులు, అధునాతన వసతు లతో కూడిన మున్సిపల్ పార్కులు, రహదా రులు, పార్కింగ్ స్థలాలు, ఫుట్‌పాత్‌లు, డివైడర్లు నగ రానికే తలమానికంగా ఉన్నాయన్నారు. కడప నగరాభివృద్ధిలో భాగంగా స్వచ్ఛతకు, పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. కడప నగరా భివృద్ధికి అందజేసిన ప్రతిపాదనలన్నింటికీ ఆమోదం తెలిపి, పూర్తి చేసిన అభివృద్ధి పనుల్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఇప్పటికే చాలావరకు పనులు పూర్తి చేశారని, వీటిలో చాలా పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. నగరంలోని ప్రధా న రహదారుల విస్తరణ పనులు చేపట్టి, గతంలో ఏ ప్రభుత్వమూ చేయని అభివృద్ధిని చేసి చూపించామన్నారు. అంబేద్కర్ సర్కిల్ నుంచి వైజంక్షన్ వరకు రహదారిని పూర్తి చేయడంతో ట్రాఫిక్ సమస్య పరిష్కారం లభించిందని తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి వైజంక్షన్ ద్వారా అప్సర సర్కిల్‌ను కలిపే ప్రధాన రహదారి విస్తరణలోని అడ్డంకులను అధిగమించి, వాహనాల రాకపోకలకు అనువుగా తీర్చిదిద్దిన కమిషనర్ కీలకపాత్ర పోషించారని ప్రశంసించారు. నగరంలోని మరో ప్రధాన కూడలి కోటిరెడ్డి సర్కిల్‌ను అధునాతన హంగులతో పునర్నిర్మాణం చేపట్టామన్నారు. సరికొత్త ఇంజినీరింగ్ డిజైన్‌తో వాటర్‌ఫౌంటెన్, పచ్చటి పూల మొక్కల మధ్య కోటిరెడ్డి విగ్రహాన్ని ప్రతిష్టించడం నగరానికే వన్నె తీసుకొచ్చినట్లయిందన్నారు. కడప నడిబొడ్డున ఉన్న ఏడు రోడ్ల కూడలి అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుందని తెలిపారు. కార్యక్రమంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలం సురేష్, ఉప ముఖ్య మంత్రి అంజాద్‌బాషా, ఎంపీ వైఎస్ అవి నాష్‌రెడ్డి, బద్వేల్ ఎంఎల్‌ఎ డాక్టర్ సుధ, పి.రవీంద్రనాథరెడ్డి, ఎమ్మెల్సీ ఇ.రామ చంద్రారెడ్డి, ఆర్టీసీ ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి, కడా ఛైర్మన్ గురుమోహన్, ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజ యప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ గోవిం దరెడ్డి, సెంచూరీ ఫ్లైవుడ్ ఛైర్మన్ సజ్జన్ బజ ంకా, మేనేజింగ్ డైరెక్టర్, సంజయ్ అగర్వాల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేశన్‌బజంకా, ప్రెసిడెంట్ హిమాంశ, వైస్ ప్రెసిడెంట్ తుషార్ పట్నాయక్, ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ అంకిత్ బంటియా, కలెక్టర్ విజయకుమార్, జెసి గణేష్ కుమార్, ట్రైనీ కలెక్టర్ భరద్వాజ్, కమిషనర్ జి.ఎస్.ఎస్ ప్రవీణ్‌చంద్, డిఆర్‌ఒ గంగాధర్‌గౌడ్, ఆర్డీఓ మధుసూదన్ పాల్గొన్నారు.

కంటి ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకుంటున్న ముఖ్యమంత్రి

అంబేద్కర్ సర్కిల్ ప్రారంభోత్సవంలో ప్రజాప్రతినిధులతో సిఎం

ఆధునికీకరించిన కలెక్టరేట్‌ను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రజా సమస్యలపై పోరాటాలు కొనసాగించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.వెంకటేశ్వర్లు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం సిపిఎం విస్తృతస్థాయి సమావేశం వెంకటాచలపతి అధ్యక్షత నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.వెంకటేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, సిపిఎం సీనియర్ నాయకులు హరిశర్మ, న్యాయవాది కె.సోమశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో ప్రజలు విసిగిపోయారన్నారు. ముఖ్యంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజా స్వామ్య విలువలను కాలరాస్తోందన్నారు. ప్రభుత్వ సంస్థలను కార్పోరేట్ శక్తులకు దారాదత్తం చేస్తుందని విమర్శించారు. బి.కొత్తకోట సిపిఎం నూతన కార్యవర్గ సభ్యులు ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా టి.వెంకటరమణ, కో-కన్వీనర్ పి.వీరయ్య, సభ్యులుగా ఎస్.గణేష్, సి.కల్యాన్, సి.ఆంజనే యులు,.రామప్ప, ఎస్.రామచంద్ర, జి.రామప్ప, పి.వేణు గోపాల్‌ను నియమించినట్లు తెలిపారు. మండలంలో సిపిఎం బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

వినియోగదారుల హక్కులకు చట్టపరంగా రక్షణ : జెసి

ప్రజాశక్తి- రాయచోటి

వినియోగదారుల హక్కులకు చట్టపరంగా రక్షణ ఉంటుందని, ఇందుక ప్రత్యేకంగా వినియోగదారులు రక్షణ యాక్టు-2019ను ప్రభుత్వం రూపొందించిందని జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. శనివారం రాయచోటి కలెక్టరేట్ స్పందనహాలులో జాతీయ వినియోగదారుల దినోత్సవం 2023 పురస్కరించుకొని ఇ-కామర్స్ , డిజిటల్ వర్తకం శకంలో వినియోగదారుల రక్షణ అంశంపై జిల్లా పౌరసరఫరాల అధికారి రఘురాం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ వినియోగదారుల సంక్షేమం కోసం వారికి అవగాహన కల్పించడం కోసం, వారి హక్కులను గుర్తు చేయడం కోసం ప్రతి ఏటా డిసెంబర్ 24న జాతీయ వినియోగదారుల దినోత్సవం నిర్వహిస్తోందన్నారు. వస్తుసేవల కోసం ఎలక్ట్రానిక్ విధానం, టెలిషాపింగ్, డైరెక్ట్ సెల్లింగ్, మల్టీ లెవల్ మార్కెటింగ్ వంటి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో లావాదేవీలు చేసి మోసపోయిన వినియోగదారులకు సాధ్యమైనంత సత్వర న్యాయాన్ని అందించడానికి, ఈ కామర్స్ లావాదేవీల వల్ల వచ్చే సమస్యలను పరిష్కరించడానికి కొత్త చట్టంలో వెసులుబాటు ఉందన్నారు. ఎలాంటి కొనుగోళ్లు, లావాదేవీలు చేసినప్పుడు అయినా వినియోగదారులు బిల్లులను తప్పనిసరిగా సేకరించాలిన్నారు. వారంటీ, గ్యారంటీ ద్వారా లబ్ధి పొందాలనుకునే వారు ఇన్వాయిస్, ఇతర బిల్లులను చూపించాల్సి ఉంటుందని చెప్పారు. కొనుగోలు చేసిన వస్తుసేవల్లో లోపాలు ఉన్నప్పుడు పరిహారాన్ని కోరే అవకాశం వినియోగదారులకు ఉంటుందని పేర్కొన్నారు. నష్టాన్ని భరించే ఓర్పు కంటే నష్టపరిహారం పొందే చైతన్యం రావాలి అన్నారు. వీటితో పాటు వినియోగదారులు తమ హక్కులకు సంబంధించిన పూర్తి వివరాలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. వస్తువులను తిరిగి అమ్మడానికి లేదా వాణిజ్య ప్రయోజనాల కోసం కొనుగోలు చేసేవారు వినియోగదారులు కాదని ఈ అంశంపై కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి రఘురాం మాట్లాడుతూ వినియోగదారుల వివాదాల పరిష్కారం కోసం మూడంచెల చట్టపరమైన వ్యవస్థ అందుబాటులో ఉందన్నారు. డిఇఒ శ్రీరామ్ పురుషోత్తం మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక హక్కులతో పాటు వినియోగదారుల హక్కుల గురించి కూడా అవగాహన కలిగి ఉండాలి అన్నారు. కొనుగోలు చేసిన వస్తు సేవల కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల మేనేజర్ పి. శివరాం మూర్తి, డిఎంహెచ్‌ఒ డాక్టర్ కె. కొండయ్య, విద్యాశాఖ అధికారులు, ఎపి కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్‌తోనే అభివృద్ధి సాధ్యం : డిఇఒ

ప్రజాశక్తి- రాయచోటి

వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకత శక్తి వెలుగులోకి వస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరామ్ పురుషోత్తం అన్నారు. శనివారం అన్నమయ్య జిల్లా రాయచోటి ఎగువ అబ్బవరం వద్దనున్న అర్చన విద్యాసంస్థలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ చిన్ననాటి నుండే సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించు కోవాలన్నారు. వైజ్ఞానిక ప్రదర్శన విద్యార్థులలో దాగివున్న సృజనాత్మకతకు సాన పెట్టే విధంగా ఉండాలన్నారు. వినూత్న ఆలోచనలతో సాంకేతికతను అందిపుచ్చుకుని విద్యార్థులు అత్యున్నత స్థానానికి ఎదగాలన్నారు. అనంతరం పిఆర్‌టియు రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ గురువుల పైనే విద్యార్థుల భవిష్యత్ ఆధారపడి ఉంటుందని, చిన్ననాటి నుండే విద్యార్థులలో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాలన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే సైన్స్‌తోనే అది సాధ్యమవుతుందన్నారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా విద్యార్థులు పరిశీలించటం అలవాటు చేసుకోవాలని అప్పుడే మనం అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని, భావి శాస్త్రవేత్తలుగా ఎదగవచ్చన్నారు. అర్చన విద్యా సంస్థల డైరెక్టర్ మదన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకను వెలికితీసేందుకు, సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించేందుకు సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్య అంటే కేవలం మార్కుల సాధనే కాదని, జ్ఞానం, నూతన పరిశోధనల పట్ల జిజ్ఞాస పెంచుకోవటమన్నారు. ఎపిజె అబ్దుల్ కలాం, సర్ సివి రామన్, కల్పనా చావ్లా, సునీతా విలియమ్స్ తదితర మహోన్నత వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థులు స్వేచ్ఛగా ఆలోచించే విధంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మార్గదర్శనం చేయాలని సూచించారు. అనంతరం సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మండలానికి 3 చొప్పున 30 మండలాల నుంచి 90 ప్రాజెక్టులు వచ్చాయన్నారు. వీటిలో ఉత్తమ ప్రదర్శనలను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు పంపనున్నట్లు చెప్పారు. విద్యార్థులకు, వారి గైడ్ టీచర్లకు ఉచిత భోజనం, వసతి కల్పించిన మదన్ మోహన్ రెడ్డికి అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. సమావేశం అనంతరం విద్యార్థుల ప్రాజెక్టులను డిఇఒ ఇతర విద్యాశాఖాధికారులు పరిశీలించారు. ప్రాజెక్టుల విశేషాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్కౌట్స్ జిల్లా సెక్రెటరీ మడితాటి నరసింహారెడ్డి, డిసిఇబి సెక్రటరీ నాగ మునిరెడ్డి, యుటిఎఫ్ నాయకులు రాజా రమేష్, పిఎస్‌యు నాయకులు జక్రియ బాష, జన విజ్ఞాన వేదిక నాయకులు ప్రకాష్ రెడ్డి, జిల్లా అసోసియేట్ సైన్స్ ఆఫీసర్ రామచంద్ర, అప్కాస్ట్ జిల్లా కో-ఆర్డినేటర్ రవీంద్రారెడ్డి, కలాం విజన్ డైరెక్టర్ వినయ్ కుమార్, అప్కాస్ట్ అకాడమిక్ కో-ఆర్డినేటర్ రవిశంకర్ రెడ్డి, అర్చన విద్యాసంస్థల ప్రిన్సిపల్ మౌలాలి, పాల్గొన్నారు.

ఫైలేరియా వ్యాధి పట్ల అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

'ఫైలేరియా' నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి-కలకడ

ఫైలేరియా వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించినట్లు కలికిరి సబ్యూనిట్ అధికారి ముజీబ్ బాషా తెలిపారు. మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కలికిరి సబ్ యూనిట్ అధికారి షేక్ ముజీబ్‌బాషా, ఎంపిహెచ్ఇఒ జి.జయరామయ్య ఆధ్వర్యంలో ఫైలేరియా(బోదకాలు)పై దొడ్డిపల్లి గ్రామంలో రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు ఫైలేరియా వ్యాధిని గురించి ప్రజలకు అవగాహన , రక్త పూత నమూనాలను సేకరించడం జరిగిందని తెలిపారు. ఈ బోధ వ్యాధి క్యూలెక్స్ దోమ వల్ల వస్తుందని, ఈ రక్త నమూనాలు రాత్రిపూట తీస్తేనే ఈ పారాసైట్ బయటపడుతుందని అన్నారు. ఒక దోమ 100 గుడ్ల నుంచి 300 గుడ్లు పెడుతొందని, బోదకాల వ్యాధిని అరికట్టాలంటే పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఇంటి చుట్టు ప్రక్కల పాత రోళ్ళ, టెంకాయ బొప్పలు, పాత టైర్లు, పాత కూలర్లు, ప్లాస్టిక్ డబ్బాలు వాటిని తొలగించాలని సూచించారు. సాయంత్రం 6 లోపల కిటికీలు తలుపులు డోర్లు లాక్ చేసుకోవాలని దోమతెరలు వాడాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్స్ ఎం.వెంకటేశ్వరరావు, బి.రెడ్డప్ప, ల్యాబ్ టెక్నీషియన్ జమీల అహ్మద్, ఎంఎల్‌హెచ్‌పి జి.వి.గోపికృష్ణ, ఆరోగ్య కార్యకర్తలు సి.లక్ష్మీదేవి. ఎస్ వి.రమణమ్మ డి.వరలక్ష్మి ఆశా కార్యకర్తలు పద్మావతి. కె.అమరావతి పాల్గొన్నారు.

వృద్ధుడిని 108 వాహనం ఎక్కిస్తున్న శంకర్, గుల్జర్‌బాషా

ఎట్టకేలకు స్వగ్రామం చేరిన వృద్ధుడు

-ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

'నలుగురు సంతానమున్నా దిక్కులేని స్థితిలో వృద్ధుడు' అనే శీర్షికతో ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు స్పందన లభించింది. బద్వేలుకు చెందిన నన్నేసాహెబ్ అనే వృద్ధుడు కన్న బిడ్డలు వదిలేస్తే రాజంపేట లోని నూనెవారిపల్లె సమీపంలో భిక్షాటన చేసుకుంటూ ఆరోగ్యం క్షీణించి దిక్కులేని స్థితిలో ఉండగా గుండాలపల్లికు చెందిన శంకర్ వృద్ధుడికి సపర్యలు చేసి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించిన విషయం విధితమే. అప్పటి నుంచి శంకర్‌తో పాటు ఎపిఆర్‌డిసి రాష్ట్ర డైరెక్టర్ గుల్జాద్‌బాషాలు రైల్వేకోడూరులోని తన కుమారుడి చెంతకు చేర్చేందుకు ప్రయత్నించినా వారు ససేమిరా అనడంతో చివరకు సిఐడబ్ల్యూఎస్, అల్ బదర్ మస్జిద్ ల ఆధ్వర్యంలో శనివారం 108 వాహనంలో వృద్ధుడిని బద్వేలులోని తన బంధువుల చెంతకు పంపించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలో వృద్ధుడికి సేవలు అందించిన అల్బదర్ మసీదు సభ్యులు ఎస్.బుజ్జి కుమాన్, జావీద్‌లను గుండాలపల్లె శంకర్, గుల్జర్‌బాషాతో పాటు 25 సంవత్సరాలుగా సమాజ సేవ చేస్తున్న ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ వారిని ప్రత్యేకంగా అభినందించారు.

ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ కార్యదర్శిగా రవీంద్రవర్మ

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ కార్యదర్శిగా రవీంద్రవర్మను ఎన్నుకున్నట్లు ఎపిఎన్‌జిఒ అసోసి యేషన్ తాలూకా అధ్యక్షులు పి.ఓబులేసు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌జిఒ హోంలో ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, కార్యదర్శి రవికుమార్ ఆధ్వర్యంలో కార్యనిర్వహక సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల అధికారిగా జిల్లా కోశాధికారి నిత్య పూజయ్య, కార్యదర్శిగా రవీంద్రవర్మ, ఉపాధ్యక్షులుగా విజయ్‌కుమార్, జాయింట్ సెక్రటరీలుగా కిరణ్ కుమార్, ఎన్.ఉషారా ణిని ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర క్రీడా నిర్వహణపై సమావేశం

బి.కొత్తకోట : నగర పంచాయతీ పరిధిలో ఐదు సచివాలయాల సిబ్బంది, స్పోర్ట్స్ ఎంపైర్లకు ఆడదాం ఆంధ్ర క్రీడా సంబరాలపై శనివారం స్థానిక బాలుర జడ్‌పి హైస్కూల్లో కమీషనర్ పి.ఆర్.మనోహర్ ఆదేశాల మేరకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో స్కోరింగ్ యాప్, క్రికెట్, వాలీబాల్, బ్యాట్మింటన్, ఖోఖో, కబడ్డీ క్రీడల విధివిధానాలు గురించి వివరించారు. క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. సమిష్టిగా పనిచేసి ఆడుదాం క్రీడలను దిగ్విజయం చేద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆర్ఐ శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

కలకడ : వైకుంఠ ఏకాదశి వేడుకలను మండలంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. భక్తులు తమ సమీపంలో ఉన్న ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించుకున్నారు.దేవలంపేటలో వచ్చిన శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయం, గోపాలపురం లో వెలసిన శ్రీ షిరిడి సాయిబాబా ఆలయం. కోనలోని రామాలయం, బాటవారిపల్లె వెలసిన శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిసి పోయాయి.

అన్నదానం గొప్పది

నందలూరు : శ్రీ సౌమ్యనాథ స్వామి అన్నదాన ట్రస్ట్‌లో టిడిపి నాయకులు గంట గోపాలకృష్ణ ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్‌రాజు పాల్గొన్నారు. ట్రస్ట్ అధ్యక్షులు యద్దల సుబ్బరాయుడు, జగన్మోహన్ రాజును ఘనంగా స్వాగతించారు. కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి చక్రాల రామసుబ్బన్న, నిర్వాహకులు గంటా వాసుదేవయ్య, పల్లె సుబ్రహ్మణ్యం, జంగంశెట్టి సుబ్బయ్య, భూశెట్టి వెంకటసుబ్బయ్య, లంకాయ ారి సుబ్బరామయ్య, మోడపోతుల రాము, చక్రాల సాయినాథ్, పెంచలయ్య, వరదయ్య పాల్గొన్నారు.

సౌమ్యనాథుని సన్నిధిలో రైల్వే ఎడిఆర్‌ఎం

ప్రజాశక్తి-నందలూరు

ఉమ్మడి కడప జిల్లాలో ప్రసిద్ధిగాంచిన నందలూరు శ్రీసౌమ్యనాథ స్వామిని గుంతకల్లు రైల్వే డివిజన్ ఎడిఆర్‌యం సూర్యనారాయణ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సౌమ్యనాథ స్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. జిల్లా వక్ఫ్‌బోర్డు ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్ నందలూరులో ఆగిన రైళ్లను నిలుపుదల గురించి చర్చించారు. ఎడిఆర్‌యం సానుకూలంగా స్పందించి ఉన్నత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో కమర్షియల్ ఇన్స్‌పెక్టర్ జనార్దన్ కడప స్టేషన్ మాస్టర్ శేఖర్ కుమార్ పాల్గొన్నారు.

శ్రీ సౌమ్యనాధుని దర్శించుకున్న ఎడిఆర్‌ఎం

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు :పీడీ

ప్రజాశక్తి-కలకడ

ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు, అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డ్వామా పీడీ మద్దిలేటి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన కలకడ మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహిస్తున్న పనులలో ఉపాధి హామీ సిబ్బంది అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా సొమ్మును రికవరీ చేయడం జరుగుతుందని తెలిపారు. టమోటా పంటను పండిస్తున్న రైతులకు ఉపాధి పనులలో కూలీలను ఏర్పాటు చేస్తే బాగుంటుందని పీడీని అడుగగా, కేంద్ర ప్రభుత్వ నిర్ణయిస్తున్న ఈ పథకంలో టమోటా పంటలకు ఉపాధి పనులు చేయించడం జరగదని అన్నారు. మండలంలోని 16 పంచాయతీలలో 2022 సంవత్సరం ఏప్రిల్ నెల నుంచి 2023 మార్చి చివరి వరకు జరిగిన పనులలో గ్రామసభ గ్రామసభ నిర్వహించి తనిఖీలు చేసినట్లు తెలిపారు.ఉపాధి హామీ ద్వారా1096 పనులుగాను రూ .58465126 ఖర్చు చేసినట్లు ఎపి ఇడబ్ల్యూఐటిసి క్రింద ఒక పనికి రూ.318079, పంచాయతీరాజ్ కింద 32 పనులకు రూ.10076708, ఆర్డబ్ల్యూఎస్ ద్వారా చేసిన ఒక పనికి రూ.122198, ఖర్చు చేసినట్లు తెలిపారు. సామాజిక తనిఖీలలో అక్రమాలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి రూ.20వేల 97 రూపాయలు రికవరీ కింద వసూలు చేసినట్లు తెలిపారు. అక్రమాలకు పాల్పడిన ఐదు మంది ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.6వేలు అపరాధరుసుము వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీదేవి రవికుమార్, మండల పార్టీ కన్వీనర్ కమలాకర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వెంకటరమణారెడ్డి, మండల సచివాలయం చైర్మన్ మోహన్‌రాజా నాయుడు, ఎపిడి రవికుమార్, అంబులె డేన్స్ మెన్ శివప్రసాద్, డ్వామా విజిలెన్స్ అధికారి ప్రకాష్, ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి, ఎస్ఆర్‌పి భాస్కర్, ఎపిఒ చెన్నకేశవులు, ఉపాధి హామీ సిబ్బంది, సామాజిక తనిఖీ సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

మాట్లాడుతున్న పీడీ మద్దిలేటి

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎంపిపి

మాట్లాడుతున్న ఎంపిడిఒ శేఖర్‌నాయక్

ప్రజాశక్తి-గాలివీడు

ప్రజా సమస్యల పరిష్కారమే తమ ధ్యేయమని ఎంపిపి జల్లా పదావతమ్మ, ఎంపిడిఒ శేఖర్‌నాయక్‌లు పేర్కొన్నారు. శనివారం ఎంపిడిఒ సభా భవనంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలో 25 శాఖలు ఉన్నాయని ఆ శాఖలకు వచ్చిన సమాచారాన్ని, ప్రభుత్వపథకాలను ఆయా ప్రతినిధులు, సర్పంచ్, ఎంపిటిసిల ద్వారా కార్యక్రమాలు నిర్వహించుకోవాలని అని పేర్కొన్నారు. హౌసింగ్ వర్క్ ఇన్స్‌పెక్టర్ మహేంద్రరెడ్డి మాట్లాడుతూ మండలంలో సిమెంటు, కడ్డీలు కూడా అందుబాటులో ఉన్నాయని ఇసుక మాత్రం అందుబాటులో లేదని అన్నారు. గొల్ల చెరువు సర్పంచ్ మాట్లాడుతూ పునాదులు వేసుకున్న వారికి ఇంకా బిల్లు రాలేదని, ఎమ్మెల్యే చేతుల మీదులుగా బిల్లుల జాబితా ఇచ్చినా కూడా బిల్లులు పెట్టలేదన్నారు. సర్పంచ్ ఉమాపతిరెడ్డి మాట్లాడుతూ కొత్తగా కొన్ని హౌసింగ్ వాడికి బిల్లు అందలేదని సకాలంలో బిల్లు చూడాలని పేర్కొన్నారు. ప్రభుత్వం అందించిన నిధులు వృధా కాకుండా చర్యలు తీసుకోవాలని ఈనెల లోపు ప్రధానోపాధ్యాయులు, ఎంపిటిసిలు, సర్పంచ్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని ఎంఇఒ శ్రీనివాసులు కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ దైవాదినం, ఎంపిటిసిలు చంద్రారెడ్డి, కడప అమాన్, చిన్నపరెడ్డి, సర్పంచ్‌లు దీప్తి, మీట్టుపల్లి లక్ష్మీదేవి, కేశవరెడ్డి, ఎఒ మురళీధర్, ఎపిఎం, ఉపాధి ఎపిఒ, వైఎస్ ఎంపిపి1 యధుభూషణ్‌రెడ్డి, వైస్‌ఎంపిపి2 గాలి శ్రీనివాసులు, హార్టికల్చర్ ఎఒ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సుకుమార్‌రెడ్డి

దేశానికి వెన్నెముక రైతు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైతులు దేశానికి వెన్నెముక లాంటి వారిని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజమ్ సుకుమార్‌రెడ్డి అన్నారు. శనివారం డాక్టర్ వైఎస్‌ఆర్ ఉద్యాన పరిశోధన స్థానం అనంతరాజుపేటలో సాయి రాధాకృష్ణ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్స్ నియంతృత్వ శాఖ సాకారంతో జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడి ప్రభుత్వ సహాయ సహకారాలతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం సుబ్బరామరాజు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కోరుతూ ప్రభుత్వాన్ని కోరుతూ తనవంతు కృషి చేస్తానని అన్నారు. ఆదర్శ రైతు వెంకటరామరాజు మాట్లాడుతూ రైతులకు ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యతను వివరిం చారు. సాయి రాధాకృష్ణ ఎడ్యుకేషనల్ సొసైటీ డాక్టర్ డి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జాతీయ రైతు దినోత్స వం ప్రాముఖ్యత గురించి వివరించారు. డాక్టర్ వైఎస్‌ఆర్ ఉద్యాన పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కెటి.వెంకటరమణ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు మామిడి, అరటి, బొప్పాయి పంటలలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. శాస్త్రవేత్తలు శ్రీధర్, సందీప్‌నాయక్ మాట్లాడుతూ మామిడి, అరటి, బొప్పాయి పంటలలో పాటించవలసిన సమగ్ర యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. కార్యక్రమంలో కొండారెడ్డి జడ్‌పిటిసి రత్నమ్మ, ఎంపిటిసి మల్లికార్జున్, సర్పంచ్‌లు సుబ్బయ్య, జంగల్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, ఆదర్శరైతు సుదర్శన్ రాజు, సుబ్రహ్మణ్యం, రాజమోహన్‌రెడ్డి, ఎపిసిఎస్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఎస్ఎస్‌సి మోడల్ టెస్ట్ పేపర్స్ పంపిణీ

ప్రజాశక్తి-పుల్లంపేట

స్థానిక పట్టణంలోని ఎస్‌పివిడి సభ హై స్కూల్, ఎస్‌బిఎం సిఎస్ఐ స్కూల్‌లో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సి మోడల్ టెస్ట్ పేపర్స్‌ను ఎంఇఒ నాగతిరుమలరావుచే విద్యార్థులకు పంపిణీ చేసినట్లు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సాంబశివరావు, ఎస్‌వి.రమణ తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలలకు ఆరు మోడల్ టెస్ట్ పేపర్స్‌కు ఆర్థిక సహకారం అందించిన ఎంఇఒకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకొని ఈ మోడల్ టెస్ట్ పేపర్స్‌ను అవగాహన చేసుకుని ప్రతి ఒక్కరూ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులు కావాలని కోరారు. మండలంలోని విద్యార్థులందరూ నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు మంచి నడవడికతో విద్యనభ్యసించి తల్లిదండ్రుల ఆశలను నెరవేరుస్తూ ఉపాధ్యాయులకు, గ్రామానికి మంచి పేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌బివిడి సభ హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు మురళిరెడ్డి వరదారెడ్డి, భాను, రమణ మూర్తి, శంకరయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు టెస్ట్ పేపర్లను అందిస్తున్న ఎంఇఒ

క్రిస్మస్ కేకును కట్ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నలందలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రీజెన్సీ నలంద పాఠశాలలో శనివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాస్టర్ జాన్ ప్రభాకర్ ముఖ్య అతిథులుగా పాల్గొని క్రిస్మస్ విశిష్టతను వివరించారు. ముందుగా కేకు కోసి వేడుకలు చేసుకున్నారు. ఈ వేడుకలో చిన్నారులు వివిధ రూపాలలో అలంకరించుకొని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మురళీమోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజ్‌డమ్ హైస్కూల్‌లో..

రైల్వేకోడూరు : మండలంలోని విజ్‌డమ్ సిబిఎస్ఇ హైస్కూల్‌లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విజ్ డమ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ టి.ప్రదీప్ పాల్గొని క్రిస్మస్ ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు నాటకాలు నృత్యాలతో అలరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాలను వీక్షించారు. కార్యక్రమంలో అడ్మిన్ డైరెక్టర్ టి మదన్మోహన్, ప్రిన్సిపల్ టి.ప్రియాంక పాల్గొన్నారు.

తపస్య విద్యా సంస్థల ఆధ్వర్యంలో..

కలికిరి : కలికిరి తపస్య విద్యా సంస్థలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కలికిరి మండలంలోని రెడ్డివారిపల్లి సమీపంలో తపస్య విద్యా సంస్థలో కరస్పాండెంట్ రామంజులు నాయుడు, శివప్రసాద్ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహారించారు. విద్యార్థులు వివిధ రకాల వేషధారణలతో శాంతాక్లాస్ అలరించారు. క్రీస్తును స్మరిస్తూ కొందరు విద్యార్థులు నృత్యప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయున, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని మల్లయ్య కొండపై చేపట్టిన ఆలయ పునర్నిర్మాణపు పనులు నాణ్యతగా త్వరగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా మల్లయ్య కొండను సందర్శించారు. ఆలయ కమిటీ చైర్మన్ కెఆర్ మల్రెడ్డి, పూజారులు ఈశ్వరప్ప , మల్లికార్జునలు ఎమ్మెల్యేకకు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు అభిషేకాలతో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం కొండపై జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కొండపై ప్రకృతి అందాలను తిలకించారు.ఆయన వైస్‌ఎంపిపి కరీం, సురేష్, కళ్యాణ్‌లు ఉన్నారు.

సొంత నిధులతో డ్రెయినేజీ సమస్య పరిష్కారం

ప్రజాశక్తి- రాయచోటి

పట్టణంలోని 14వ వార్డులో ప్రజలు డ్రెయినేజీ సమస్యతో ఇబ్బందులు పడుతునాక్నరని తన సొంత నిధులు కేటాయించారు. శనివారం వార్డు టిడిపి ఇన్‌ఛార్జి లక్ష్మిదేవి స్థానికులు కలిసి డ్రెయినేజీ సమస్యను రమేష్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వార్డును సందర్శించి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. వెంటనే తన సొంత నిధులను కేటాయించారు. పనులు త్వరగా చేపట్టి సమస్యను పరిష్కరించాలని నాయకులను ఆదేశించారు. దీంతో వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బోనమల ఖాదర్ వలీ, పాత రాయచోటి సాయి, మా బాష, వెంకట చలపతి, మన్సూర్, ఇస్మాయిల్, వసంత, రవిశంకర్ రెడ్డి, గన్మెన్‌రాజు, ప్రభాకర్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు సింగిల్ విండో అధ్యక్షులుగా 'నారే' ప్రమాణం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు సింగిల్విండో అధ్యక్షుడిగా నారే వెంకటరమణా రెడ్డి ఆదివారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. స్థానిక తిరుపతి రోడ్డులోని సింగల్విండో కార్యాలయంలో ఆదివారం ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జివి శ్రీనాథరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు మండల వైఎస్ఆర్సిపి కన్వీనర్ దండు జగన్మోహన్ రెడ్డి తెలిపారు. డైరెక్టర్లుగా స్టాంపుల మస్తాన్, తిమ్మయ్య కూడా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

26న 'ఆడుదాం ఆంధ్ర' : జెసి

ప్రజా శక్తి రాయచోటి

ఈ నెల 26న జిల్లా వ్యాప్తంగా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించేందుకోసం అన్ని విధాలా సిద్ధం కావాలని జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ విసి హాల్ నుంచి ఈనెల 26వ తేదీన జిల్లాలో ప్రారంభించనున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, పంచాయతీ కార్యదర్శులతో విసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతి సచివాలయం పరిధిలో ఘనంగా ప్రారంభించాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం చంగల్‌రాయుడు

నూరు శాతం ఉత్తీర్ణతకు కృషి

ప్రజాశక్తి-కలకడ

పదవ తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తానని కోన జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోడం చంగల్ రాయుడు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు సొంత ఖర్చులతో పదవ తరగతి విద్యార్థులకు విజయ సాధన పుస్తకాలను ఉచితంగా అందజేసినట్టు తెలిపారు. ఈ పుస్తకం అనుభవిజ్ఞులైన ఉపాధ్యాయులచే రూపొందించబడిందని ఇందులో ఉన్న విష యాలను చక్కగా అర్థం చేసుకొని రాబోయే మార్చిలో జరిగే పదవ తరగతి పరీక్షలలో అందరు విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. భవిష్యత్తుకు 10వ తరగతి మొదటి మెట్టు వంటిదని దీనిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని తెలిపారు. విద్యార్థులు సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండి ఈ మూడు నెలలు ఇష్టంగా చదివి సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివారెడ్డి, రమేష్ కుమార్‌రెడ్డి, గఫార్‌ఖాన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

తమ న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని గ్రామ రెవెన్యూ సహాయకులు తహశీల్దార్ రఫిక్‌అహ్మద్‌కు వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే విఆర్‌ఎల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగన్నరేళ్లు పూర్తయినా సమస్యలను పరిష్క రించకపోవడం బాధాకరమని అన్నారు. వేతనాలు రూ.26 వేలకు పెంచాలని, నామినీ విఆర్‌ఎలను రెగ్యు లరైజ్ చేయాలని, డిఎ వర్తింప చేయాలని కోరారు. అర్హులైన విఆర్‌ఎలను అటెండర్, వాచ్ మెన్లుగా పదో న్నతి కల్పించడం, 65 సంవత్సరాలు పూర్తయిన విఆర్‌ఎల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. రాష్ట్ర నాయకుల పిలుపు మేరకు తహసిల్దారుకు వినతి పత్రం అందజేశామన్నారు. ఇప్ప టికైనా ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ పంచాయతీలకు చెందిన విఆర్‌ఎలు పాల్గొన్నారు.

రహదారి విస్తరణ పనులు చేస్తున్న జెసిబి

ముమ్మరంగా జాతీయ రహదారి విస్తరణ పనులు

ప్రజాశక్తి-ములకలచెరువు

ములకలచెరువులో జాతీయ రహదారి విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. రోడ్డు కిరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగిస్తూ రోడ్డు చదును చేస్తున్నారు. ములకలచెరువు నుంచి మదనపల్లె వరకు ఉన్న 43 కిలో మీటర్ల ముంబాయి–చెన్నై జాతీయ రహదారి పనులకు కేంద్ర ప్రభుత్వం రూ.480.10 కోట్లు విడుదల చేసింది. గత ఏడాది డిసెంబరు 17న శ్రీ సత్యసాయి - అన్నమయ్య జిల్లా సరిహద్దులో జాతీయ రహదారి - విస్తరణ పనులు ప్రారంభించారు. ఈ క్రమంలో ములకలచెరువు ప్రధాన రోడ్డు మినహా మదనపల్లె వరకు రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా చేపట్టారు. ములకలచెరువులో కూడా బుధవారం నుంచి పనులు ప్రారంభించారు. రోడ్డు కిరువైపులా భారీ యంత్రాలతో ముమ్మరంగా చదును చేస్తున్నారు.

ఓటరు జాబితాలను పరిశీలిస్తున్న తహశీల్దార్ ప్రదీప్

ఓటర్ల జాబితా తనిఖీ

ప్రజాశక్తి-కలకడ

మండలంలో ఓటరు జాబితాను తహశీల్దార్ ప్రదీప్ తనిఖీలు నిర్వహించారు.శనివారం మండల కేంద్రమైన కలకడ తహశీల్దార్ కార్యాలయంలో గ్రామ పంచాయతీలలో ఉన్న బిఎల్ఒ ల వద్ద ఉన్న ఓటరు జాబితాను తనిఖీలు చేసి తప్పులు సరిచేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఓటరు జాబితాలను తమ తమ పరిధిలో ఉన్న పోలింగ్ బూత్‌ల లెక్కన పరిశీలించి ఓటరు జాబితాలో మృతి చెందిన,వివాహమైన వారిని గుర్తించి, ఓటరు జాబితా నుండి తొలగించాలని తెలిపారు. నూతనంగా ఓటరుగా నమోదు చేసుకున్న వారి పేర్లను, ఇంటిపేర్లను, తండ్రుల పేర్లను, వయసును, గుర్తించి ఓటరు జాబితాలో నమోదు చేయించుకోవాలని బిఎల్‌ఒలను ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో విఆర్‌ఒలు, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

బదిలీలు సర్వసాధారణమే

ప్రజాశక్తి-గాలివీడు

ప్రతి ఉద్యోగికి బదిలీలు, పదోన్నతులు సర్వసాధారణమని, విధుల్లో ఉన్నంత వరకు మంచి పేరు సంపాదించుకోవడానికి ప్రతి ఒక్కరూ జూనియర్ అసిస్టెంట్ నాగరాజునాయక్ లాగా పేరు సంపాదించుకోవాలని ఎపి డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జల్లా సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ సభా భవనంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేసి సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతో బదిలీ కావడంపై ఆయన సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అధికారులు, నాయకులకు ఆయనను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపిడిఒ కార్యాలయంలో అందరికీ అందుబాటులో ఉండి విధులపట్ల అంకితభావంతో పనిచేశారని నాగరాజును కొనియాడారు. వైస్ ఎంపిపి వన్ మిట్టపల్లి యదుభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ ఆరు సంవత్సరాలు ఇక్కడ విధులు నిర్వహించి నిజాయితీతో విధులు నిర్వహించారని అన్నారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి మంచిపేరు తెచ్చుకున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శేఖర్‌నాయక్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జాబిరహ్మద్, వైస్ ఎంపిపి2 గాలి శ్రీనివాసులు, ఎంపిపి జల్లా పద్మావతమ్మ, తహశీల్దార్ దైవాదీనం, సర్పంచ్‌లు ఉమాపతి రెడ్డి , రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

నాగరాజును సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు